

# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



త్వరలో ప్రచురణ కాబోతున్న పుస్తకం నుంచి

ముందుగానే కౌముది పాఠకులకోసం.. ప్రత్యేకంగా..!

సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

## కాంప్లెక్సు

**ఉష, రాజమండ్రి:**

**నేను ఎమ్.బి.ఏ చేశాను. పెద్ద కంపెనీలో ఉద్యోగం. నలభై వేలకు పైనే వస్తోంది. ఉద్యోగంలో చేరిన వెంటనే నా క్లాస్‌మేట్‌ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. ఆయన ఓ చిన్న కంపెనీలో అకౌంటెంట్ గా పని చేస్తున్నారు. జీతం నాకంటే చాలా తక్కువ. దానికి నేనేం బాధపడటం లేదు. మొదట్లో చాలా సంతోషంగా ఉండేవాళ్ళం. కానీ ఈ మధ్య తను లోలోపల కుమిలిపోతున్నాడని అనిపిస్తోంది. తనకంటే నాది మంచి ఉద్యోగం అనీ, ఎక్కువ జీతం అనీ చాలాసార్లు అనేస్తుంటాడు. అది మాములుగా అనడం లేదేమో అని నాకు అనిపిస్తోంది. ఇది మా ఇద్దరి మధ్య గ్యాప్ ను పెంచుతుందేమో అని కూడా భయంగా ఉంది. తన మనసులో నుంచి ఆ ఫీలింగ్ ను ఎలా తీసేయాలి?**

ఈ ప్రపంచంలో ఎవరికి వారు పరిష్కరించుకోవలసిన, పరిష్కారం చెప్పలేని ఒకే ఒక్క సమస్య "ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు". ముందు మీరు మీ బాధనీ, భయాన్ని తనకి స్పష్టంగా అర్థమయేటట్టు చెప్పాలి. మీ భర్త మనస్తత్వం ఎటువంటిది? సున్నిత మనస్కుడా? లేక ప్రాక్టికల్‌గా ఆలోచించేవాడా? అతడు ప్రాక్టికల్ అయితే, "నాకన్నా నీకు జీతం తక్కువని నువ్వు బాధపడుతున్నావ్! నేనేం చేయాలో నువ్వే చెప్పు. ఉద్యోగం మానేయనా?" అనండి. కంగారుపడి 'వద్దు-వద్దు' అంటాడు.

అతడు సున్నిత మనస్కుడైతే, ఒక పది రోజుల పాటు ఇద్దరూ హాయిగా ఎక్కడకైనా వెళ్ళండి. మెల్లిగా మీ భావాలను తనతో పంచుకోండి. 'తన కన్నా మీ జీతం ఎక్కువన్న కారణం వల్ల మీరు కూడా బాధపడుతున్నారు' అన్న సంగతిని అతనికి తెలిసేలా చేయండి. పనిలో పనిగా....(ప్రేమ వివాహం అంటున్నారు కాబట్టి) డబ్బు లేకపోవడం వల్ల వచ్చే కష్టనష్టాల గురించి కూడా డిస్కస్ చేయండి. మిమల్ని ప్రేమించే వ్యక్తి కాబట్టి, అతడు మీలో జరిగే సంఘర్షణను తప్పకుండా అర్థం చేసుకుంటాడు.




ప్రతి మనిషి తాలూకు గది తాళం చెవి అతడి మనసు పెట్టె లోనే ఉంటుంది. ఖాళీగా ఉండి అనవసరపు ఆలోచనలతో సతమతమవ్వకుండా, తీరిక వేళలో ఏదైనా హాబీ పెంపొందించుకునేలా ప్రోత్స హించండి. చిత్రలేఖనం నుంచి పత్రికలకు వ్యాసాలు వ్రాయటం వరకు ఏదైనా కావొచ్చు. ఏ మంచి హాబీ లేనివాళ్లకు నిరాశాపూరితమైన ఆలోచనలు ఎక్కువ వస్తాయి. ఏమో ఎవరు చెప్పొచ్చారు.... రేపు అతడి హాబీనే అతన్ని ఉన్నత శిఖరాల మీద నిలబెట్ట వచ్చేమో!

**నందిత, చేబ్రోలు:**

**నేను నల్లగా, పొట్టిగా ఉంటాను. మొహం మీద మచ్చలు. కళ్ళజోడు. జుట్టు కూడా ఊడిపోతోంది. బయటకు వెళ్ళాలన్నా, అందరితో మాట్లాడాలన్నా ఫ్రీగా ఉండలేక పోతున్నాను. నా మీద నాకు అసహ్యం వేస్తోంది. ఏం చేయాలో అర్థం కావటంలేదు.**

సమస్యలు రెండు రకాలు. మనం అధిగమించ గలిగేవి. అధిగమించ లేనివి. అధిగమించ లేని సమస్యల్ని మర్చిపోవాలి. అధిగమించగలిగినవి దాటుకుని ఉన్నత స్థానాల్ని చేరుకోవాలి. మీరు జాగ్రత్తగా గమనిస్తే చాలా రంగాల్లో పెద్ద పెద్ద స్థానాలు అలంకరించిన వారందరూ కాస్త అందవిహీనంగానో, ఆర్థికంగా బలహీనంగానో ఉంటారు. ఆ ఆత్మన్యూనతా భావమే బహుశా వారి వెనుక స్ఫూర్తి. మిమ్మల్ని మీరు ప్రేమించడం మొదలు పెట్టండి. అందంతో కాదు. ఏదైనా కళతో గెలవండి. సచిన్ టెండూల్కర్ పొట్టి. స్టీఫెన్ హాకింగ్ అంగవైకల్యుడు. మదర్ థెరెస్సా నిశ్చయంగా ఐశ్వర్యారాయ్ లా ఉండదు. అయినా కూడా వారందరూ కృషితో, పట్టుదలతో పైకొచ్చారు. అందరి చేతా గుర్తింప బడ్డారు. వారిని ప్రేరణగా తీసుకుంటే మీకంటూ ఒక ప్రపంచం ఏర్పడు తుంది. బెస్టాఫ్ లక్.

## మొహమాటం

**త్రివేది, కాకినాడ**

**ఆఫీసులో కొలీగ్స్ అప్పు అడిగినప్పుడు ఇవ్వను అనలేక పోవటం నా మంచితనం. కానీ వాళ్ళు ఆ తరువాత మొహం చాటేస్తున్నారు. ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు.**

ఇవ్వటం వల్ల వచ్చే ఆనందంకన్నా, కోల్పోయేదాని వల్ల వచ్చే విషాదం ఎక్కువైతే దాన్ని 'మొహమాటం' అంటారు. కోల్పోయేదాని వల్ల వచ్చే విషాదం కన్నా, ఇచ్చేదానివల్ల వచ్చే ఆనందం ఎక్కువైతే దాన్ని 'దాతృత్వం' అంటారు. నష్టం కలిగించే మంచితనం అర్థరహితం. ఆర్థిక విషయాల్లో మొహమాటం కూడదు.

ఒక ఉదాహరణ చూద్దాం. మీ స్నేహితుడు కాబూలీవాలా నుంచి మూడు రూపాయల వడ్డీకి లక్ష తీసుకున్నాడు. రెండు సంవత్సరాల నుంచి వడ్డీ కడుతున్నాడు. ఆ సమయంలో అతడికి నెల రోజుల కోసం అర్జెంటుగా మరో లక్ష రూపాయలు అవసరం వచ్చింది. మీ రిటైర్మెంట్ డబ్బులోంచి అతడికి అప్పిచ్చారు. అతడికి అనుకున్న సమయానికి డబ్బు రాలేదు. దాదాపు ఆర్నెల్లనుంచీ మీ చేబదులు వెనక్కి ఇవ్వలేదు. ఈ సమయంలో అతనికి ఎక్కడ్నించో కేవలం లక్ష డబ్బు వచ్చింది. అప్పటికే మూడు రూపాయల వడ్డీకి ఇచ్చిన కాబూలీ అతడి మీద ఒత్తిడి తీసుకొస్తున్నాడు. వచ్చిన డబ్బు అతను మీకిస్తాడా? కాబూలీకి ఇస్తాడా?

మొహమాటం కూడా కాంప్లెక్స్‌లో ఒక భాగమే. ఆ మాటకొస్తే కాంప్లెక్స్ ఉన్న వ్యక్తులే మొహమాటస్తులుగా మారతారు. ఇతరుల కోరికలకీ, మన ఇబ్బందులకీ మధ్య సరైన గీత గీసుకోగలిగితే మానవ సంబంధాలు బావుంటాయి.




అవతలివారు మనతో ఎలా ఉంటే మనకి బావుంటుందో మనం చెప్పకపోతే వారికి ఎలా తెలుస్తుంది? ఇతరులకి "నో" చెప్పటం వారిని మనకి దూరం చెయ్యవచ్చు. "యస్" చెప్పటం మనని మనకి దూరం చేయకూడదు కదా! మీరో విద్యార్థి అనుకోండి. అప్పుడే చూసిన సినిమా గురించి మీ స్నేహితుడికి ఫోన్ చేశారు. అవతల్నుంచి "సారీ. చదువుకుంటున్నాను. రేపు మాట్లాడుకుందాం" అని సమాధానం వచ్చింది. అతడి మీద నీకు శత్రుత్వం పెరిగిందా? గౌరవం పెరిగిందా?

**రామోజి, నల్లమర్ల:**

**సర్. నేను ఒక కార్పొరేట్ సంస్థలో పని చేస్తున్నాను. మా బాస్ తన ఆఫీస్ పనులన్నీ మాతోనే చేయిస్తాడు. దీనితో వత్తిడి మరియు వర్క్ లోడ్ ఎక్కువ అవుతుంది. నేనే కాదు. మా ఆఫీసులో ఒకరిద్దరికి ఈ ఫీలింగ్ ఉన్నది. బాసే కదా మాకు మెమోలు ఇచ్చేది. అందుకే మొహమాటంతో 'నో' అని చెప్పలేక పోతున్నాను. పరిష్కారం చూపించగలరు.**

నీ జీవితంలో ముఖ్యమైనవారు ముగ్గురు: నిన్ను కష్టాల్లో ఆదుకునేవారూ, నిన్ను కష్టాల్లోకి నెట్టేవారూ, నువ్వు కష్టాల్లోంచి బయట పడగలవని నమ్మకం ఉన్నవారు.

మొదటిదీ, మూడోదీ మీరే.

మీ ఉద్యోగం బాసు మీద ఆధారపడి ఉంది కాబట్టి 'నో' చెప్పలేక పోతున్నారో, మొహమాటంతో 'నో' అని చెప్పలేక పోతున్నారో సరిగా వ్రాయ లేదు. మీ బాసు కేవలం మిమ్మల్ని మాత్రమే ఇలా వేధిస్తున్నాడో, అందరిపట్లా ఆవిధంగానే ఉంటున్నాడో చెప్పలేదు. ఆఫీసులో పని ఎక్కువగా ఉండి, ఉద్యోగస్తులు తక్కువగా ఉన్నా ఈ సమస్య వస్తుంది. ఆయన పని మానేసి, అది కూడా మీకిస్తున్నాడా, లేక... స్టాఫ్ తక్కువై, మీతో పాటూ ఆయన కూడా కష్టపడుతున్నాడా? అనేది మీరు వ్రాయలేదు.

మీ ఉద్యోగాన్ని తీసేసే అధికారం బాసుకి ఉన్నట్టయితే మీకు రెండే దార్లు. ఆయన చెప్పిన పనంతా చేయటం, లేదా ఉద్యోగం వదిలేయటం. కానీ మీరు 'మొహమాటం' అన్న పదం వాడారు. మీరు ఒకవేళ 'నో' అని చెప్పినా మీ బాస్ మిమ్మల్ని ఏమీ చేయలేకపోయినా,



మీ ప్రమోషన్‌కి అడ్డుపడే అధికారం ఆయనకి లేకపోయినా, నిర్మొహమాటంగా 'ఆ పని నేను చేయ(లే)ను' అని చెప్పండి. ఒకవేళ అలా చెప్పటానికి మళ్ళీ మొహమాటం అయితే, ఆఫీసులో ఎన్ని గంటలు పని చేసినా తరగని పని వత్తిడి, మీరు నిర్వహిస్తున్న బాధ్యతలు ఉత్తరం వ్రాసి ఆయన టేబిల్ మీద పెట్టండి. ముఖ్యంగా ఆయనకున్న అధికారాల గురించి ఒక నిర్దిష్టమైన అవగాహనతో ఉండి ఒక నిర్ణయం తీసుకోండి.

## కాలేజీ సమస్యలు

**మంజరి, హైదరాబాద్:**

నేను ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా రూమ్మేట్ పద్ధతి అంత బాలేదు. ఎప్పుడూ ఫోన్లో గట్టిగట్టిగా మాట్లాడుతూ ఉంటుంది. అర్ధరాత్రి వరకూ ల్యాప్-టాప్ లో సినిమాలు చూస్తూ ఉంటుంది. అది నాకు చాలా ఇబ్బందిగా ఉంది. ప్రశాంతంగా చదువుకోవడానికి ఉండదు, నిద్రపోవడానికి ఉండదు. ఇన్నాళ్లూ భరించాను కానీ పరీక్షలు దగ్గర పడుతున్నప్పుడు కూడా అలానే చేస్తుంటే భరించలేక వార్డెన్ కి చెప్పాను. ఆవిడ మందలించింది. మారాల్సింది పోయి ఆ అమ్మాయి కావాలని ఇంతకు ముందు కంటే ఎక్కువ గొడవ చేస్తోంది. రూమ్ మార్చమంటే వార్డెన్ ఒప్పుకోవడం లేదు. ఆ అమ్మాయిది చాలా పెద్ద బ్యాగ్రౌండ్ అట. అందుకే ఎవరూ అంత సీరియస్ గా తీసుకోవట్లేదనిపిస్తోంది. నా సమస్య ఎలా తీరుతుంది? నేనిప్పుడు ఏం చేయాలి?



చాలామంది హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు (ముఖ్యంగా విద్యార్థినులకు) ఇది చాలా పెద్ద సమస్య. ఇలాంటి కాంప్లెయింట్స్ దాదాపు ప్రతి కాలేజీ లోనూ ఉంటున్నాయి. బాగా చదువుకొనే విద్యార్థినులని ఒక గదిలోనూ, అల్లర చిల్లరగా చదివేవారిని మరొక గదిలోనూ వేయాలనే స్పృహ వార్డెన్లకు ఉండదు. అయితే వారి సమస్యలూ, కారణాలూ వారికి ఉంటాయి.

మీరింకా మొదటి సంవత్సరమే చదువుతున్నారు కాబట్టి, నాలుగేళ్ళపాటూ ఇలాంటి డిస్టర్బెన్సెస్ ఉంటే కష్టం. పై అధికారులతో కానీ, ప్రిన్సిపాల్‌తో కానీ మాట్లాడమని మీ తల్లిదండ్రులకు చెప్పండి. అక్కడితో సమస్య పరిష్కారం అవుతుంది. లేదా మీరు ఏ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నారో ఆ కరెస్పాండెంట్‌తో మీ పెద్దవాళ్ళు డైరెక్టుగా మాట్లాడొచ్చు.

**రామలక్ష్మి, నాగార్జునసాగర్.**

నేను ఇంటర్లో మంచి మార్కులతో పాస్ అయ్యాను. ఇప్పుడు పై చదువుల కోసం హాస్టల్లో ఉన్నాను. ప్రతి రోజు ఏడు గంటలకల్లా పుస్తకాల ముందు కూర్చొని చదువు కోవటం మా తండ్రి చిన్నప్పుడే అలవాటు చేసారు. హాస్టల్లో అలా చేస్తుంటే నా తోటి విద్యార్థులందరు హేళన చేస్తున్నారు. "ర్యాంకర్ వచ్చిందిరా మన కాలేజీకి" అని ఎగతాళి పట్టిస్తున్నారు. వాళ్ళలా జీవితాన్ని ఎంజాయ్ చేయమని అంటున్నారు. నన్ను ఒక్కదాన్ని చేసి ఏడిపిస్తున్నారు. నాకేం చేయాలో అర్థం కావడం లేదు.

ఈ ప్రపంచంలో ఐదుగురు ఐన్‌స్టీన్‌లు, పదిమంది పైథాగరస్‌లు ఉండరు. ఒక్కరే ఉంటారు. అలాగే బాగా చదువుకునే వాళ్ళు కొంతమందే ఉంటారు. మిగతా వాళ్ళందరూ వాళ్ళను మెచ్చుకుంటూనో, లేదా ఎగతాళి చేస్తూనో, తమ లాగా వాళ్ళు జీవితాన్ని ఎంజాయ్ చేయటం లేదు అని భ్రమ పడుతూనో ఉంటారు. మీ తండ్రి మీకు ఒక మంచి దినచర్యని అలవాటు చేసారు. దానిని కొనసాగించండి. క్రమక్రమంగా క్లాస్ లో మీకు వచ్చే మంచి పేరు చూసి వాళ్ళందరూ నోరు మూసుకుంటారు.

కాలేజీ రోజుల్లో సిగరెట్ తాగేవాడు, మందు కొట్టేవాడు పదిమందిలో గ్రూప్ లీడర్‌గా తాత్కాలికంగా రెచ్చిపోవచ్చు కానీ గోల్డ్ మెడల్ వచ్చినవాడికి ఉన్న గౌరవం అతడికి ఉండదు. 'నీరము తప్త లోహమున' అన్న పద్యంలో చెప్పినట్టు, ఒకరోజు తామరాకు మీద తళతళలాడిన నీటిబొట్టులా ... వారు కాలేజీ రోజుల్లో వెలిగి, ఆ పైన అమెరికా వాడి క్రింద డైలీ లేబరుగా మారతారు. మీరు డిఫరెంట్‌గానే ఉండండి. పిల్లలని తరచూ "యు అర్ డిఫరెంట్ రా" అంటూ పెంచమని పెద్దలకి కూడా మేము ఎప్పుడూ చెప్తూ ఉంటాం. మీరు నిర్భయంగా, నిశ్చింతగా మీ 'చదువుకునే అలవాటు'ని కొనసాగించండి. బెస్ట్ ఆఫ్ లక్.

### గంగాధర్, ఏలూరు.

**నేను ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాను. కాలేజీలో మా మేడమ్‌తో సమసయ్‌గా ఉంది. క్లాస్‌లో పాఠం చెప్పేటప్పుడు అందరిలాగే నేనూ నవ్వుతూ ఉంటాను. ఇతరులు నవ్వినప్పుడు ఏమీ అనని మేడం ఎప్పుడూ నన్నే తిడుతూ ఉంటారు. క్లాస్‌లో నవవ్‌డం మానేశాను. అయినా, ఇతరులెవరైనా నవ్వినా ఆమె నన్నే తిడుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. సలహా ఇవవ్‌గలరు.**

ఆమె మనఃస్థితి, గృహపరిస్థితి తెలీదు కాబట్టి తరచు పిల్లల్ని ఎందుకు తిడుతోందో వదిలేద్దాం. తిట్టటానికి ఎప్పుడూ 'మిమ్మల్నే' ఎందుకు ఎన్నుకుంటూందో కారణాలు వెతకండి. మీ నవ్వు ఎలా ఉందో పరిశీలించుకోండి. వెటకారంగా ఉందా? ఆమె లెక్చర్ని



పరిహసిస్తున్నట్టూ ఉందా? అలా ఉంటే ఎవరికైనా వళ్ళు మండుతుంది కదా. రెండో విషయం ఏమిటంటే, నవ్వుతూ ఉండటం వేరు. ఆహ్లాదంగా ఉండటం వేరు. మేము తరచు క్లాసుల్లో విద్యార్థులకు 'సీరియస్ గా ఉండొద్దనీ, పాఠాల్ని ఆహ్లాదంగా వినమనీ' చెప్తూ ఉంటాము. చాలామంది టీచర్లు క్లాసులో పిల్లల్ని, "నవ్వకు. శ్రద్ధగా విను" అని తిడుతూ ఉంటారు. శ్రద్ధగా వినటం అంటే సీరియస్‌గా వినటం కాదు. ప్రశాంతంగా వినటం. అవసరమున్న చోట నవ్వటం సంవర్ధకం. అవసరం లేని చోట నవ్వటం అనర్థకం. ఈ సమాధానం ఆమె చదివేలా చెయ్యండి. మీ సమస్య తొలగిపోతుంది.

ఆఫీసు సమస్యలు.

### శంకర్రావు, జీడిమెట్ల:

**నేనో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగిని. ఎవరైనా రూల్స్ పాటించకపోతే నచ్చదు. ఆఫీసులో కొలీగ్స్ కానీ, రోడ్డు మీద ఆటోవాడు కానీ, అది ఎవరైనా కానీ నియమాలు తప్పితే సహించలేను. అలా చేయడం తప్పు కదా అని ముఖమ్మీదే అడిగేస్తాను. అది ఎవరికీ నచ్చదు. నీకు అవసరమా అని కొందరు అంటారు. 'ఏదో తనే పెద్ద సిన్సియర్ అయినట్టు' అని కొందరు ఎగతాళి చేస్తుంటారు. నేనలా చేయడం తప్పా ఒప్పా అనేది నాకిప్పటికీ అర్థం కాదు. మీరు చెప్పండి... నాలో లోపం ఉందా?**

సమాజంలో జరుగుతున్న అక్రమాలను చూసి, ఆవేశం రావటం, రక్తం సలసలా మరగటం సాధారణమే. అయితే, "పరిస్థితి అలా తయారవటానికి మనం కూడా దోహదపడుతున్నామా?" అనే విషయం ఆలోచించు కోవాలి. దాన్నే ఇంగ్లీష్ లో 'సెల్ఫ్–రియలైజేషన్' అంటారు. రోడ్డు పక్కన చెత్త చూసి ప్రభుత్వం మీద కోపం తెచ్చు కున్నారని అనుకుందాం. దానికి ముందు మీరెప్పుడైనా రోడ్డుమీద చెత్త పడేశారా? అని ఆలోచించుకోవాలి. సినిమాలో లంచగొండి అధికారి మీద హీరో ఉమ్మేసినప్పుడు ప్రేక్షకులందరూ చప్పట్లు కొడతారు. చిత్రమేమిటంటే అలా కొట్టినవాళ్ళలో చాలామంది లంచగొండులు కూడా ఉంటారు. ఒక వర్షం కురుస్తున్న రాత్రి ఆటోవాడు రెట్టింపు చార్జీ

అడిగినప్పుడు కోపం రావటం సహజమే. ఎందుకంటే బలహీనత మీద అతడు ఆడుకుంటున్నాడు కాబట్టి..! అయితే, పాస్ బుక్ కోసం వచ్చిన రైతుని లంచం అడిగితే, ఇతరుల బలహీనతల మీద ఆడుకునే వారిలో మీరు కూడా ఒకరన్న మాట. అప్పుడు మీకు, ఆటో డ్రైవర్ మీద కోపం తెచ్చుకునే అధికారం లేదు.

ఇకపోతే, మీ ఆవేశం తగ్గించుకోవటానికి, సమాజంలో ఏఏ పరిస్థితుల పట్ల ఉద్వేగం కలుగుతోందో, వాటిని వ్యాసాలుగా వ్రాసి పత్రికలకి పంపించండి. ఫేస్ బుక్కులో పోస్టులు, బ్లాగులు పెట్టడం కూడా ఒక పద్ధతి. దీన్నే "ఔట్-లెట్" అంటారు. తమ అంతర్గత ఆవేశానికీ, ఉద్విగ్నతకీ కారణమైన పరిస్థితుల పట్ల ప్రతిస్పందించటానికి చాలామంది కళాకారులు ఎన్నుకునే పద్ధతి ఇది. అవలంబించి చూడండి. మంచి ఫలితం రావచ్చు.

**అభిరామ్, ఊరుపేరు లేదు:**

**నేను ఒక ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగంలో చేరినపపేటి నుంచీ నాకు మనశ్శాంతి లేకుండాపోయింది. సూసైడ్ థాట్స్ కూడా వస్తున్నాయి. ఆ జాబ్‌లో చేరక ముందు నేను చాలా సంతోషంగా ఉండేవాడిని. ఇపపేడు నేను ఏదో పోగొట్టుకున్న వాడిలా మారాను. ఈ పరిస్థితి భరించ లేక రిజైన్ చేసేశాను. నేను జాబ్‌కి రిజైన్ చేయడం మా ఇంట్లో వాళలకేు నచచేడంలేదు. మా నాన్న రోడ్డు పకకేన బండి మీద పళ్లు అమ్ముతుంటారు. మా వాళ్లు నాకు పెళ్లి చేయాలనుకుంటున్నారు. ఈ పరిస్థితిలో నాకు లేనిపోని ఆలోచనలతో నిదరపేటటేడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. దయచేసి సలహా చెప్పండి.**



ఆఫీసు వాతావరణం నచ్చకపోయినా, చెయ్యవలసిన పని చేతకాక పోయినా, పై అధికారులు సాడిస్టులైనా చచ్చిపోవాలని అనిపించటం సహజం. అయితే కొన్ని సార్లు మనకి నచ్చని పనులు కూడా చెయ్యవలసి వస్తుంది. మీ తండ్రి గారు ఎండలో, వర్షంలో నిలబడి పళ్ళు అమ్ముతూ ఉంటారు. ఎంత వేగంగా వీలైతే అంత తొందరగా ఆయన్ని ఆ శ్రమ నుంచి తప్పించటం మీ బాధ్యత కాదా? నచ్చని పని మానేసారు సరే. ప్రస్తుతం ఏమి చేస్తున్నారు? పని లేకుండా కూర్చోవటం కన్నా, ఆలోచనలతో నిద్ర లేని రాత్రులు గడపటం కన్నా నికృష్టం మరొకటి లేదు. మీరేమి చెయ్యగలరో ఆలోచించండి. ఏదో ఒకటి చెయ్యటం మాత్రం మానకండి. నిరంతరం శ్రమించేవారికన్నా, ఏపనీ లేనివారికే నిద్ర సరిగ్గా పట్టదు.

**(కొనసాగింపు వచ్చేనెల)**